సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



రీ పోస్టుమార్టం
పూడ్చిపెట్టిన బాలుడి మృతదేహాన్ని వెలికితీసి అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు.
వివరాలు 8లో ▸



ఏటీఎంలకు వచ్చేవారే టార్గెట్
ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చే అమాయకులను టార్గెట్ చేసుకొని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు 8లో ▸



లీకేజీతో నీరంతా వృథా
కాకతీయుల కాలంలో నిర్మించిన ఎల్లమ్మ చెరువు జలకళను సంతరించుకుంది. కానీ తూము లీకేజీతో నీరు వృథాగా పోతోంది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

3 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3 నుంచి 23 వరకు పది, ఇంటర్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు, అక్టోబర్ 16 నుంచి 23 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి (80084 03635)ని సంప్రదించాలన్నారు.

పనివేళలు శాస్త్రీయంగా నిర్వహించాలి



ప్రజ్ఞాపూర్‌లో గురుకుల టీచర్ల నిరసన

గజ్వేల్: గురుకుల పాఠశాలల పనివేళలు శాస్త్రీయంగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ (తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం ప్రజ్ఞాపూర్‌లోని గురుకుల పాఠశాలలో నల్ల బ్యాడ్జీలను ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన వలీ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నంబర్ 16ద్వారా గురుకుల పాఠశాలల్లో పని వేళలను మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ పనివేళలు విద్యార్థులపై ఒత్తిడి పెంచేవిధంగా ఉన్నాయని చెప్పారు. శాస్త్రీయంగా నిర్వహించేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్, గురుకుల టీచర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నివారిద్దాం

- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



విద్యార్థుల మానవహారం

హుస్నాబాద్: ప్లాస్టిక్ కవర్లను వాడడం వల్ల భూ కాలుష్యం పెరిగి పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేయించి విద్యార్థులచే ఎస్‌హెచ్‌ఎస్ ఆకృతిలో మానవ హారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ మీ తల్లిదండ్రులతో ఇంటి వద్ద తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేయించి మున్సిపల్ వాహనానికి అందించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు తమ బాధ్యతగా వారంలో రెండు గంటల పాటు శ్రమదానం నిర్వహించి స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటయ్య, వాసుదేవ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మోదీ కృషి వల్లే గొప్ప ఆర్థిక శక్తిగా భారత్

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ధరమ్ గురువారెడ్డి



మాట్లాడుతున్న ధరమ్ గురువారెడ్డి

గజ్వేల్: ప్రధాని నరేంద్రమోదీ కృషి వల్లే భారత్ గొప్ప ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ధరమ్ గురువారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా మోదీ అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాలన చేపడుతున్నారని కొనియాడారు. మూడోసారి అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే 15లక్షల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారని చెప్పారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగుల అభివృద్ధికి ప్రాధాన్యతిస్తూ ముందుకుసాగుతున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డి, వెంకటరమణ, ప్రముఖ న్యాయవాది రమణ, పట్టణ శాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాఫీ.. మాకెప్పుడు?



అక్కన్నపేట మండలం రామవరంలో రైతుల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్న అధికారి

రూ.2లక్షల కంటే ఎక్కువ పంట రుణం ఉన్న రైతులు మాకెప్పుడు రుణ మాఫీ అని ఆందోళన చెందుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పలు నిబంధనలతో రూ.2లక్షల వరకు రుణ మాఫీని మూడు విడతల్లో చేసింది. అయితే అంతకు పైగా రుణం పొందిన రైతుల గురించి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 1,02,323 బ్యాంకు ఖాతాలకు రూ.843.05 కోట్లను రుణ మాఫీ చేశారు. మాఫీ అయిన రైతులు సంతోషంలో ఉండగా.. మాఫీ కానీ రైతులు నిరాశగా ఎదురుచూస్తున్నారు. 31 మార్చి 2024 వరకు జిల్లాలో 2,09,093 మంది రైతులు సుమారు 2026.85 కోట్లు రుణాలు తీసుకున్నారు. 9 డిసెంబర్ 2023 వరకు మాత్రమే రుణ మాఫీ వర్తింప జేస్తున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకుని రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులకు రూ.2లక్షల వరకు పంట రుణ మాఫీ చేశారు.

ప్రకటించని విధివిధానాలు..

రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు రుణ మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ రైతులకు సంబంధించి విధివిధానాలు ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. రూ. 2లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ఎలా చెల్లించాలి? ఎప్పటి వరకు చెల్లించాలనే అంశం స్పష్టత ఇవ్వలేదు. తమకు రుణ మాఫీ అవుతుందా? లేదా? అని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూ.2లక్షలకు పైగా రుణ ఉన్న రైతులు కొందరు మిగతా డబ్బులు చెల్లించారు. వివిధ సమస్యలు, రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వారు మొత్తంగా సుమారు 70వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎదురుచూపుల్లో రైతులు

- రూ.2లక్షలకు పైగా ఉన్నవారిపై స్పష్టత కరువు
- 1.02 లక్షల ఖాతాలకు రూ.843 కోట్లు మాఫీ

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ

రుణ మాఫీ కానీ వారి నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయి. కుటుంబ నిర్ధారణ కోసం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 80శాతం వరకు వివరాలను అప్‌లోడ్ చేసినట్లు సమాచారం.

మిగతా డబ్బులు చెల్లించా..



మాది సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి గ్రామం. మాకు 4 ఎకరాల భూమి ఉంది. సిద్దిపేటలోని ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకులో పంట రుణం రూ.2.11లక్షలు ఉందని చెప్పారు. మాఫీ కాకపోవడంతో బ్యాంకు అధికారులను అడిగితే మిగతా డబ్బులు కడితే రుణమాఫీ అవుతుందని చెప్పడంతో 15 రోజుల క్రితం రూ. 25 వేలు చెల్లించాం. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది కానీ ఇంతవరకు రుణ మాఫీ కాలేదు.

– బోనాల భాస్కర్, నాంచారుపల్లి, సిద్దిపేట అర్బన్

పెట్టుబడికి వస్తాయని..



మాకున్న 5.10 గుంటల వ్యవసాయ భూమిలో వరి, పత్తి సాగు చేస్తాం. ప్రతి ఏడాది మా పేర్ల మీద తీసుకున్న రూ. 2లక్షల పంట రుణాలను రెన్యూవల్ చేశాను. పంటల పెట్టుబడికి అవసరం అవుతాయానుకుంటే ఇప్పటి వరకు రావడం లేదు. రుణ మాఫీ కోసం ఎదురుచూస్తున్నా.

– లోకటి రమేష్, రామసాగరం

ఎలాంటి ఆదేశాలు రాలేదు



రూ.2లక్షలకు పైబడిన వారి గురించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వెంటనే అమలు చేస్తాం. రుణ మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలను సైతం మంజూరు చేస్తున్నాం. – హరిబాబు, ఎల్‌డీఎం



సిద్దిపేట పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రవక్త ప్రవచనం..

సిద్దిపేటలో ముస్లింల శాంతి ర్యాలీ

విశ్వశాంతికి మార్గదర్శనం

సిద్దిపేటజోన్: మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు విశ్వ శాంతికి మార్గదర్శనం అని, ఒక్క ఇస్లాం ధర్మానికే కాకుండా ఆయన మొత్తం మానవాళికి ప్రవక్త అని ఉలేమాలు పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట ఉలేమాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఇక్బాల్ మినార్, ముస్తాబాద్ చౌరస్తా నుంచి ఈద్గాకు చేరుకుంది. అనంతరం దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు ఇక్బాల్ అశ్రఫీ, కరీంపటేల్‌లు మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త కారణజన్ముడని, ఆయన చూపిన బాటలో నడిస్తే జీవితం సుఖశాంతులతో వర్ధిల్లుతుందన్నారు. సాటి మనిషిని అకారణంగా హతమారిస్తే మొత్తం మానవాళిని హత మార్చినంత పాపం మూట కట్టుకున్నట్టేనని ప్రవక్త హితబోధ చేశారని అన్నారు. సహనం, ఓపిక, శాంతి, ధర్మం లాంటి నిరాడంబర జీవితం ఎవరైనా గడుపుతారో వారు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులు అవుతారని ప్రవక్త చెపిన్నట్టు పేర్కొన్నారు. తల్లిదండ్రులకు సేవ చేస్తే జీవితం సఫలం అయినట్టేనన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని గంగ, జమున, తహజీబ్ తరహాలో కలిసి ఉండాలని సూచించారు. శాంతి ర్యాలీ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో సిఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్‌లు బందోబస్తు పర్యవేక్షించారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించడం పట్ల పోలీసు అధికారులు నిర్వాహకులను అభినందించారు.

పచ్చదనం, పరిశుభ్రత తప్పనిసరి

- సీపీ అనురాధ
- పోలీసు కన్వెన్షన్ సెంటర్, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల సందర్శన



పోలీసు కన్వెన్షన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కార్యాలయాల్లో పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతకు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సీపీ అనురాధ సూచించారు. స్థానిక పోలీసు కన్వెన్షన్ సెంటర్, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సీపీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెల్ఫేర్ ఆఫీసులో ఉన్న రికార్డులు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. జిల్లాలో పోలీసుల వెల్ఫేర్ గురించి సబ్సిడరీ క్యాంటీన్ ద్వారా నిత్యావసర సరుకులు మార్కెట్ కంటే తక్కువ రేటులో అందిస్తున్నారన్నారు. పోలీసుల సంక్షేమం గురించి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగల నిర్వహణ

సిద్దిపేటకమాన్: జిల్లాలో గణపతి నవరాత్రోత్సవాలు, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని సీపీ అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. వారం రోజులుగా జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా విధులు నిర్వహించారని వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. అలాగే తమకు సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కూడా సహకరించారన్నారు. జిల్లాలో 3,038 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు తెలిపారు.

కనీస పెన్షన్ రూ. 5వేలు ఇవ్వాల్సిందే



ధర్నాలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

ఈపీఎఫ్ ఆఫీస్ ఎదుట బీఎమ్మెస్ ధర్నా

సిద్దిపేటజోన్: బీడీ కార్మికుల ప్రస్తుత పెన్షన్ రూ.వెయ్యి నుంచి ఐదు వేలు పెంచాలని భారతీయ మాజ్దూర్ సంఘ్(బీఎమ్మెస్) ఆధ్వర్యంలో గురువారం ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎమ్మెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దం రాజిరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల గడిచినా ఇప్పటికీ కనీస పెన్షన్ పెంచలేదన్నారు. గత రెండేళ్లుగా బీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికులకు ఆరోగ్య బీమా కలిప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఈపీఎఫ్ కమిషనర్ అవినాష్‌కు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, మల్లేశం, చంద్రమౌళి, సరిత, వసంత, అనిత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

సిద్దిపేటరూరల్: చాలా రోజులుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దివ్యాంగుల స్వేచ్ఛా సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించాలన్నారు. అదేవిధంగా పెన్షన్ పెంపు, అంత్యోదయ కార్డులు, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చందనగిరి రాజు, అనిల్, మల్లేశం, నర్సింహారెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పటిష్టతే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- గజ్వేల్‌లో టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్: విద్యా వ్యవస్థను పటిష్టం చేయడానికి ప్రభుత్వ కృషితో పాటు ఉపాధ్యాయుల బాధ్యత కీలకమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం రాత్రి గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమావేశంలో స్కావెంజర్లు, కరెంటు బిల్లుల సమస్యలు పరిష్కారమైనట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై దృష్టి పెట్టాల్సిన అవసరముందన్నారు. ఈ దిశగా ఉపాధ్యాయులు తమ ఆలోచనలను, అభిప్రాయాలను ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి అందించాలన్నారు. ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా కార్యాచరణ సిద్ధం చేయాల్సిన అవసరముందన్నారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ప్రకాష్‌రావు, టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. అంతకుముందు కోదండరాంను ఉపాధ్యాయులు సన్మానించారు. అదే విధంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించారు.

గుణాత్మకమైన విద్యను అందించండి : డీఈఓ

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం హైస్కూల్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లో పలు సబ్జెక్టుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజన మోనూ ప్రకారం తయారు చేయాలన్నారు. అక్కడ వండిన పదార్థాలను పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. పాఠశాల ఆవరణలు పరిశుభ్రమయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్‌బహద్దూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించండి

మద్దూరు(హుస్నాబాద్): క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని టీబీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ ప్రోగ్రాం జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రేబర్తి సబ్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్షయ వ్యాధి ఉన్నవారిని గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్టూవర్ట్ సన్, హెచ్‌ఈఓ భువనేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఏఎన్‌ఎం మల్లోత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు కట్ట దున్నేశాడు..



గౌరవెల్లి ప్రాజెక్టు కట్టను దున్నేసి సాగుకు సిద్ధం చేసి..

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కట్టను ఓ వ్యక్తి దున్నేశాడు. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి పరిధిలోని బంజారాహిల్స్ తండా సమీపంలో ప్రాజెక్టు కట్టను దున్నేసి పశువుల పాకను సైతం ఏర్పాటు చేశారు. కట్టను ఆక్రమించి సాగుకు అనుకూలంగా సిద్ధం చేయడంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రాజెక్టు కట్ట వద్ద ఎలాంటి పనులు జరగకుండా ఉండేందుకు ఇటీవల ఎన్జీటీ ఆదేశించడంతో సీసీ కెమెరాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ కట్ట పొడవు 10 కిలో మీటర్ల మేర ఉంటుంది. కానీ కొంతమంది సమీప రైతులు ప్రాజెక్టు కట్టను అనుకొని కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. కట్టను రక్షించకపోతే కట్ట మనుగడకే ప్రమాదమని రైతులు అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ అనంతరెడ్డిని 'సాక్షి' సంప్రదించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

.. స్టేషన్‌కే కళొచ్చింది

- నాచారం.. బహు సుందరం
- రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి
- కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

సాక్షి ఎఫెక్ట్

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి సమీపంలోని నాచారం రైల్వేస్టేషన్‌కు కళొచ్చింది. నిన్నమొన్నటి దాకా బోసిపోయిన స్టేషన్‌లో ప్రయాణికుల సందడి మొదలైంది. నాచారం రైల్వేస్టేషన్‌లో అసాంఘిక శక్తుల ఆగడాలు, రూ. కోట్ల విలువైన సామగ్రి అపహరణ, కిటికీలు, తలుపుల చోరీ, కొరవడిన రోడ్డు సౌకర్యం, తదితర అంశాలను ఎప్పటికప్పుడు 'సాక్షి' ప్రత్యేక కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. తాజాగా 'నాచారం..ఇదేం గ్రహచారం' శీర్షికతో ప్రచురితమైన కథనం రైల్వేశాఖలో కదలిక తెచ్చింది. నాచారం రైల్వే స్టేషన్‌పై దృష్టిసారించింది. స్టేషన్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసింది. గుంతలతో కూడిన మట్టిరోడ్డును తొలగించి ప్రయాణికులకు సౌకర్యవంతంగా స్టేషన్‌దాక యుద్ధప్రాతిపదికన సీసీరోడ్డును నిర్మించింది. స్టేషన్ వద్ద భద్రత పరమైన చర్యలు చేపట్టింది. అసాంఘిక శక్తుల ఆగడాలకు కళ్లెం పడేలా రైల్వేపోలీసుల నిఘా పెంచింది. దీంతో ప్రయాణికుల్లో భరోసా పెరిగింది. సీసీరోడ్డు సమకూరడంతో రాకపోకలు సుగమమయ్యాయి. మొత్తానికి ప్రయాణికులతో నాచారం రైల్వేస్టేషన్ సందడిగా కన్పిస్తోంది. స్టేషన్ సమీప గ్రామాల ప్రజలు క్రమేపి రైలు ప్రయాణం వైపు మొగ్గుచూపుతుండడంతో రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నది. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు, పూర్తిస్థాయి సౌకర్యాలు మెరుగుపరచాలని ఈ ప్రాంత ప్రజలు రైల్వేశాఖ అధికారులను కోరుతున్నారు.



నాచారం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు



క్లుప్తంగా

'సంఘటితంగా సమస్యలు పరిష్కరించుకుంటాం'


మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేటకమాన్: తామంతా సంఘటితంగా ఏర్పడి సమస్యలు పరిష్కరించుకుంటామని రిటైర్డ్ పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప గారి రాజులు అన్నారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ అయిన తమకు అనేక సమస్యలు ఉన్నాయని వాటి సాధన కోసం సంఘటితంగా పోరాటం చేస్తామన్నారు. సిద్దిపేట రిటైర్డ్ ఆఫీసర్స్ యూనియన్ కార్యాలయం నిర్మాణానికి గత ప్రభుత్వం సిద్దిపేటలో స్థలం కూడా కేటాయించిందని గుర్తు చేశారు. కొద్ది రోజుల్లో యూనియన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు నసీరుద్దీన్, ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీలు గౌస్ పాషా, రామారావు, కోశాధికారి విశ్వనాథం, సభ్యులు వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, ఇంద్రసేనారెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎర్రరాయి తవ్వకాలపై మైనింగ్ అధికారుల దాడులు

రెండు ట్రాక్టర్లు, లారీ స్వాధీనం


లారీని పట్టుకున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గణేశ్ పూర్ గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న ఎర్ర రాయి తవ్వకాలపై గురువారం మైనింగ్ అధికారులు దాడులు చేశారు. ఇందులో జిల్లా మైనింగ్ ఆర్ఐ సాయిరాం, స్థానిక రెవెన్యూ అధికారులు శ్యామ్‌రావు, లాల్ సింగ్ పాల్గొని రాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక లారీలను సీజ్ చేసి హద్నూర్‌లోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారి సాయిరాం మాట్లాడుతూ.. గణేశ్‌పూర్‌తో పాటు హద్నూర్, న్యామతాబాద్ గ్రామాల శివారులో కూడా ఎర్ర రాయి తవ్వకాలు చేపట్టొద్దని సూచించారు. అక్రమంగా ఎర్ర రాయి తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిమజ్జనం ప్రశాంతం : ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని, విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందికి, సహకరించిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 7వ తేదీన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాగా జిల్లాలో ప్రశాంతం వాతావరణంలో కొనసాగేలా వివిధ శాఖలు సమన్వయంతో పని చేసినట్లు తెలిపారు. 12 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది కృషితోనే ఈ ఉత్సవాలు విజయవంతమైనట్లు తెలిపారు. అలాగే మిలాద్ ఉన్ నబీ పండుగ శాంతియుత వాతావరణంలో ప్రజలందరూ జరుపుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

రామాయంపేట(మెదక్): విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని ప్రగతి ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామస్తులు వితరణ చేసిన కంప్యూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లను మరమ్మతు చేయడానికి వీలుగా తన నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ప్రకటించారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడారు. సిద్దిపేట చేతిరాత నిపుణులు ఆజాద్ విద్యార్థులకు మంచి చేతిరాత మెలకువలు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు పోచమ్మ, మాజీ ఎంపీటీసీ సిద్దిరాంరెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 రోజుల తర్వాత శవం వెలికితీత

- పూడ్చిన స్థలం వద్దే బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం
- శాంపిల్స్ సేకరించిన అధికారులు
- మృతిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


పోస్టుమార్టం అనంతరం మాట్లాడుతున్న తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): కొన్యాల గ్రామంలో పూడ్చిన బాలుడి మృతదేహాన్ని 12 రోజుల తర్వాత వెలికితీసి గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్ అధికారుల బృందంతో కలిసి విలేకరులతో వివరాలు వెల్లడించారు. కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల కుమారుడు దశ్విక్ (45 రోజులు)కి తీవ్ర జ్వరం రావడంతో 5వ తేదీన సంగారెడ్డిలోని శిశు రక్ష ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడికి డెంగ్యూ సోకిందని మూడు రోజులపాటు వైద్యం చేసిన డాక్టర్లు 8న పరిస్థితి విషమంగా ఉందని నీలోఫర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే నీలోఫర్‌కు తీసుకెళ్లగా వైద్యులు బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో అదే రోజు గ్రామంలో అంత్యక్రియలు జరిపారు.

పూడ్చిన స్థలం వద్దే..

కుమారుడి మృతికి కారణమైన శిశు రక్ష దవాఖానపై చర్యలు తీసుకోవాలని బాలుడు తండ్రి ప్రభులింగం 13న సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.. అందులో భాగంగా పూడ్చిపెట్టిన బాలుడి మృతదేహాన్ని గురువారం బయటకు తీసి అదే చోట సంగారెడ్డి వైద్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ వేణుగోపాలరావు, దీపక్ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం నుంచి సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్టుల ఆధారంగా బాలుడు డెంగ్యూతో చనిపోయాడా.. మరో ఇతర కారణంతోనైనా చనిపోయాడా అనేది తెలుస్తుందని తెలిపారు. దాని ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. సంగారెడ్డి టౌన్ ఎస్సై నర్సింలు, డిప్యూటీ తహసీల్దార్ దావుద్, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడు


బాలుడి తల్లిదండ్రులు

సంగారెడ్డి శిశు రక్ష ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని బాధితులు అనురాధ, ప్రభులింగం ఆరోపించారు. మూడు రోజులపాటు ఆస్పత్రిలో బాలుడికి వైద్యం చేసి డెంగ్యూ ఉందని లక్షకు పైగా డబ్బులు తీసుకున్నారన్నారు. ఆస్పత్రిలో బాబును చూపించలేదని, చనిపోయాక కూడా వైద్యం చేసి డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. సంగారెడ్డి శిశురక్ష ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలకు దిక్సూచి

- ఏచూరి సంస్మరణ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్


ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మల్లికార్జున్, తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఏచూరి దిక్సూచి లాంటి వారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. కార్మిక లేబర్ కోడ్స్‌పై శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సదస్సులో ఏచూరి సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మల్లికార్జున్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను ఏచూరి ప్రభావితం చేశారని కొనియాడారు. నిస్వార్థ రాజకీయాలకు అంకితమైన వ్యక్తి అని, ఆయన్ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశానికి ఎనలేని సేవలు అందించారని, విప్లవానికి దిక్సూచిగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక లేబర్ కోడ్స్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్స్ వల్ల కార్మికులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మహిపాల్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన వేడుకల్లో అపశృతి

- డ్యాన్స్ చేసేందుకు కొమ్మల కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి
- కిందపడటంతో తీవ్రగాయాలై మృతి
- కొండపాక మండలంలో ఘటన
- చేగుంటలో నీట మునిగి యువకుడు


నర్సింలు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): గణేశ్ నిమజ్జన వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. డ్యాన్స్ చేసేందుకు చెట్టు కొమ్మలు ఇరుస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కొండపాకలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన ఊరేగింపును బుధవారం సాయంత్రం ప్రారంభించారు. యువకులు డీజే పెట్టుకొని నృత్యాలు చేస్తున్నారు. అర్ధరాత్రి గ్రామానికి చెందిన నర్సింలు(50) సైతం నృత్యం చేసేందుకు కొమ్మలు కావాలని వేప చెట్టు ఎక్కాడు. కొమ్మలను ఇరుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తర లించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి యువకుడు

చేగుంట(తూప్రాన్): చెరువులో నీట మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మైసన్నగారి నవీన్(25) గణేశ్ నిజ్జనం అనంతరం స్నేహితులతో కలిసి స్నానం కోసం చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా నవీన్ మృతదేహాన్ని గజఈతగాళ్ల సాయంతో బయటకు తీయించారు. ఘటనా స్థలాన్ని ఎంపీడీఓ చిన్నారెడ్డి, తహసీల్దార్ నారాయణ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ : పలువురికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్) : గణేశ్ నిమజ్జనోత్సవంలో ఇరు వర్గాలు దాడి చేసుకున్న ఘటన పిల్లుట్ల, బిజ్లిపూర్ గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి పిల్లుట్ల గ్రామ సెంటర్ వద్ద వినాయకుడిని నెలకొల్పారు. బుధవారం రాత్రి నిమజ్జనంలో భాగంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో వివాదం నెలకొని కాంగ్రెస్, బీజేపీ వర్గాల వారు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టి బందోబస్తు మధ్య వినాయకుడి నిమజ్జనం చేశారు. అలాగే, బిజ్లిపూర్ గ్రామంలో పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని రెండు వర్గాలు దాడులు చేసుకున్నాయి. ఈ రెండు దాడుల్లో పలువురికి తీవ్ర గాయాలు స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ప్యాకేజింగ్ రంగంలో మార్పులు వరం



సమ్మేళనం సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, సొసైటీ చైర్మన్, ఇతర ప్రతినిధులు

- ప్రొఫెసర్ మాధవన్ స్వామినాథన్

నర్సాపూర్: సెమీ కండక్టర్ ప్యాకేజింగ్ రంగంలో వస్తున్న పెను మార్పులు భారత్‌లో విద్యార్థులకు వరంగా మారబోతున్నాయని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ 'హెడ్' ప్రొఫెసర్ మాధవన్ స్వామినాథన్ అన్నారు. నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ సాంకేతిక సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో ప్యాకేజింగ్ రంగంలో జరుగుతున్న అభివృద్ధి వేలాదిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు అందుకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకొని సెమీ కండక్టర్ ప్యాకేజింగ్ రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన హితవు పలికారు. యూనివర్సిటీ ఆఫ్ మాంక్టన్ (కెనడా) డీన్ ప్రొఫెసర్ పాండురంగ ఆశ్రిత్ మాట్లాడుతూ.. విద్యార్థులు మెటీరియల్ రంగంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని ఒడిసి పట్టుకోవటం ద్వారా మరిన్ని అవకాశాలు పొందవచ్చని సూచించారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు మాట్లాడుతూ.. తమ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడే అనేక సమ్మేళనాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నా. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, హెచ్ఓడీ సంజీవ రెడ్డి, కన్వీనర్ వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇంటి తాళం పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డ ఘటన మండల పరిధిలోని రామునిపట్లలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యాసరేని లక్ష్మయ్య ఆరోగ్యం బాగా లేకపోతే 16న ఇంటికి తాళం వేసి కామారెడ్డిలో ఉంటున్న కూతురి వద్దకు వెళ్లారు. వైద్యం చేయించుకొని అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం ఇంటి ముందు ఉన్నవారు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, చోరీ జరిగిందని చెప్పడంతో లక్ష్మయ్య దంపతులు హుటాహుటినా వచ్చారు. ఇంట్లో చూడగా బీరువాలోని రూ.63 వేల నగదు, తులం బంగారం, మూడు తులాల వెండి కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

మీ సేవలో చోరీ..

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు.. మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మీ సేవ షటర్ తాళాలు పగులగొట్టిన దొంగలు, కౌంటర్‌లో రూ.11 వేల నగదును ఎత్తుకెళ్లారు.ఆ పక్కనే ఉన్న దుర్గా భవానీ మెడికల్ షాపులో సైతం చోరీకి పాల్పడ్డారు.

పరీక్షల్లో ఫెయిలయ్యానని నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన సాత్విక(22) బీఎస్సీ నర్సింగ్ చదువుతుంది. అయితే నర్సింగ్‌కి సంబంధించి వెలువడిన ఫలితాల్లో సాత్విక ఫెయిల్ అయ్యింది. దీంతో 18న బుధవారం తన సెల్‌ఫోన్‌లో 'తాను పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నానని' వాయిస్ మెసేజ్ పెట్టి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. సోదరి అదృశ్యంపై సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- కారును ఢీకొట్టిన బైక్


సురేశ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అంబరయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన సురేశ్(28), మహేందర్ ఇద్దరూ బైక్‌పై బుధవారం రుద్రారం గ్రామ సమీపంలోని తోషిబా సమీపంలోని వైన్స్‌కు వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా రాజస్థాన్ దాబా సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో చికిత్స పొందుతూ సురేశ్ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


శివకుమార్(ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం మంగాపూర్ గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రా మానికి చెందిన మన్నే శివ కుమార్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఉంటున్న రెండో భార్య దగ్గరికి బుధవారం రాత్రి బైక్ పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో హత్నూర మండలం మంగాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి మన్నె యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇనుప ఫెన్సింగ్ తీగపై పడి..


లచ్చయ్య మృతదేహం

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు ఇనుప ఫెన్సింగ్ తీగపై పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం సింగాయపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలకు చెందిన పొలాస లచ్చయ్య(55) చాలా ఏళ్ల నుంచి భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ గజ్వేల్ ప్రాంతంలో హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో పని చేసుకుంటున్నాడు. అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ తీగ మీద మృతిచెందాడు. మృతుడి బంధువులకు సమాచారం అందించి, మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామన్నారు.

పొలంలోనే రైతు..

చిన్నశంకరంపేట(మెదక్): పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన నిద్రబోయిన యాదగిరి(41) ఉదయం గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలంలో బోర్లాపడి మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్వ్యూకు వెళ్లి వస్తుండగా..

బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్ : యువకుడు మృతి


రాములు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ స్వామి కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన రాములు(34) బతుకుతెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గురువారం పటాన్‌చెరు మండలం పాశంమైలారం పారిశ్రామికవాడలో ఓ కంపెనీలో ఇంటర్వ్యూ కోసం బైక్‌పై వచ్చాడు. తిరిగి ఇస్నాపూర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో వెనుక నుంచి ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందగా, మృతుడి భార్య ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంల వద్దకు వచ్చేవారే టార్గెట్

- మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు
- 28 కార్డులు, రూ.45 వేలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఏటీఎంలు

తూప్రాన్: ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చే అమాయకులను టార్గెట్ చేసుకొని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.9,600, దతార్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.45 వేలను ఏటీఎం కార్డులు మార్చి మోసాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు ఏటీఎంల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. గురువారం ఏటీఎంల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించి హర్యానా రాష్ట్రానికి చెందిన శాహేద్‌గా గుర్తించారు. తూప్రాన్‌లోని రెండు ఏటీఎంల వద్ద, మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో ఏటీఎంల వద్ద ప్రజలను ఏమార్చి నగదు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. నిందితుడి నుంచి 28 ఏటీఎం కార్డులు, రూ.45 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు షకీల్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

బస్‌లో రూ.4.50 లక్షల బ్యాగ్ మాయం

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు


రోదిస్తున్న బాధితులు షఫీ, భార్యా పిల్లలు

కౌడిపల్లి(నర్సాపూర్): బస్‌లో రూ.4.50 లక్షలు ఉన్న బట్టల బ్యాగ్ మాయమైంది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన కౌడిపల్లి బస్టాండ్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా గోపాల్‌పేటకు చెందిన మహ్మద్‌షఫీ, భార్య రెహానా ముగ్గురు చిన్న పిల్లలతో కలిసి బుధవారం హైదరాబాద్ షాపూర్‌నగర్‌లో అతడి బంధువు హాజీ వద్దకు వెళ్లారు. షఫీ గోపాల్‌పేటలో ఇల్లు కొనుగోలు చేయడంతో వాయిదా డబ్బులు చెల్లించేందుకు హాజీ వద్ద రూ.4.50 లక్షలు అప్పు తీసుకొని గురువారం షాపూర్‌నగర్‌లోనే బాన్స్‌వాడ డిపో ఎక్స్‌ప్రెస్ బస్ ఎక్కారు. బస్‌లో రద్దీగా ఉండటంతో ముందు బట్టల బ్యాగ్‌ను పైన పెట్టి వెనుకాల నిల్చున్నారు. కౌడిపల్లి బస్టాండ్‌లో బస్ ఆపగా 30 మంది బస్‌దిగి వెళ్లిపోయారు. అప్పుడు షఫీకి బ్యాగ్ కనిపించలేదు. వెంటనే బస్‌ను ఆపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి రెండు బృందాలతో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కౌడిపల్లి బస్టాండ్, ఆటోస్టాండ్, అంగడిలో వెతికారు. దీంతోపాటు వెంకట్రావ్‌పేట, వెల్మకన్న, కొట్టాల తదితర గ్రామాల్లో ఆటోలలో ఎవరైన బ్యాగ్ తీసుకువెళ్లారా అని వెతుకుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

గురువారం ఒక్క రోజే వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. చేగుంట, పటాన్‌చెరు మండలాల్లో ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు, సిద్దిపేటలో అప్పుల బాధతో ఒకరు, పటాన్‌చెరు చిట్కూల్ గ్రామంలో కార్మికుడు ఉరి వేసుకున్నారు.

అప్పుల బాధ భరించలేక..

సిద్దిపేటఅర్బన్: అప్పుల బాధ భరింలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మర్కంటి శివకుమార్ (40) సెంట్రింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొత్తగా ఇంటిని నిర్మించుకోగా దీని కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో తరచూ బాధపడుతూ భార్య స్వప్నతో చెబుతుండేవాడు. గురువారం స్వప్న కూతురిని మిట్టపల్లిలోని గురుకుల పాఠశాల హాస్టల్‌లో దింపడానికి వెళ్లగా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆటో నడిపే వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం పోచారం గ్రామానికి చెందిన చాకలి కుమార్(33) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుమార్ బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గురువారం మృతుడి భార్య ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని కార్మికుడు..

ఉరి వేసుకొని కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన జనార్దన్ రావు (45) పాశమైలారం పారిశ్రామిక వాడలోని సింథోకెమ్ పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని వచ్చే క్రమంలో పరిశ్రమ సెక్యూరిటీ అతడి బైక్‌ను తనిఖీ చేయగా పరిశ్రమకు సంబంధించిన సామగ్రి కనిపించింది. సెక్యూరిటీ ఆ సామగ్రిని స్వాధీనం చేసుకొని అతడిని వెళ్లమని చెప్పాడు. కానీ జనార్దన్ రావు వెళ్లకుండా అక్కడే కూర్చొని కొద్దిసేపటి తర్వాత క్యాంటీన్ భవనం పై పిల్లర్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ..

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేగుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్ర వెంకటేశ్(36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలె మద్యానికి బానిసైన వెంకటేశ్ భార్య స్వరూపతో ఆర్థిక సమస్యలపై తరుచూ గొడవ పడుతుండేవాడు. గురువారం స్వరూపతో గొడవపడిన వెంకటేశ్ మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.